క్లుప్తంగా

విశ్రాంత భవనాన్ని ఆక్రమించేశారు..



కబ్జాకు గురైన షెడ్

భామిని: మండలంలోని సింగిడిలో ప్రయాణికుల కోసం నిర్మించిన విశ్రాంత భవనం ఆక్రమణకు గురైంది. వినాయక గుడి ముందు ఏబీ రోడ్డు పక్కనే నిర్మించిన భవనం కిటికీ మూసి, ముందుకు గోడ నిర్మించారు. అధికారులు స్పందించి ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ పాఠశాలలను సంరక్షించాలని కోరుతూ ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు జి.సత్యనారాయణ, ఆర్ఎస్వీ దుర్గారావు తదితరులు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మండల కేంద్రంలోని ఆమె స్వగృహం వద్ద సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి గ్రామంలో ప్రతిపాదిత ఫౌండేషన్ స్కూల్ స్థానంలో ప్రాథమిక పాఠశాల ఉండేలా చూడాలని, విద్యార్థుల సంఖ్యతో పనిలేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలన్నారు. అలాగే ప్రతిపాదిత మోడల్ ప్రాథమిక పాఠశాలలకు పీఎస్ హెచ్ఎంలను నియమించాలని, పదోన్నతుల ద్వారా పీఎస్ హెచ్ఎంలుగా నియమించాలని, మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో 120 మంది విద్యార్థులు దాటితే ఆరు మంది ఉపాధ్యాయులను నియమించాలని, ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల విలీనం చేసే ప్రతిపాదనను విరమించుకోవాలని, ఉపాధ్యాయులకు 32 పీరియడ్ల కన్నా మించకుండా చూడాలని, ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యార్థులు దాటితే రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటు క్లస్టర్ ఉపాధ్యాయులను మిగులు చూపించకుండా వారిని విద్యార్థుల సంఖ్యను బట్టి డిసెండింగ్ ఆర్డర్‌లో పాఠశాలలకు కేటాయించాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ నూతన పాఠశాలలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

వసతిగృహాల సందర్శన



కురుపాం ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తున్న న్యాయమూర్తి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల వసతిగృహాలతో పాటు కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్ సోమవారం సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కనీస సదుపాయాలన్నీ ఉండేలా చూడాలన్నారు. ఆమె వెంట మండలం లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు, కానిస్టేబుల్ ఆరిక వేణు తదితరులు ఉన్నారు.

అర్హులకు రేషన్‌కార్డులు

గంట్యాడ: అర్హులందరికీ రైస్‌కార్డులు అందజేయాలని తహసీల్దార్ పి. నీలకంఠేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైస్ కార్డుల్లో చేర్పులు, మార్పులతో పాటు కొత్త రైస్‌కార్డుల కోసం దరఖాస్తు ఆహ్వానించాలన్నారు. వీలైనంత త్వరలో అర్హులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సీఎస్‌డీటీ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

శృంగవరపుకోట: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ.. జూన్ 6న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మూడవ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు జరగనున్న నేపథ్యంలో చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

పంటలకు రక్ష..

భూసార పరీక్ష!



సంతోషపురంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది(ఫైల్)

- భూసార పరీక్షలతో రైతాంగానికి మేలు
- నేల స్వభావం, లక్షణాలు తెలుసుకునే అవకాశం
- అనువైన పంటలు వేసుకుని అధిక దిగుబడులు

గరుగుబిల్లి: వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆదాయం పొందే విధానాలు అనుసరించాలి. ఇది చేయాలంటే తమ నేల ఏ రకం.. ఏ విధమైన పంటలు వేస్తే బాగా పండుతాయన్న విషయాలు తెలుసుకోవాలి. ఇది తెలియాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. నేలలో ఉండే పోషకాలు, లోపాలు తెలుసుకునేందుకు ఈ పరీక్ష దోహదపడుతుందని, దానికి అనుగుణంగా పంటల సాగుకు ముందుకు కదలాలంటున్నారు. కొంత మంది రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు రసాయనిక ఎరువులు, పురుగుమందులను ఆశ్రయిస్తున్నారు. అవసరానికి మించి వాటిని వాడడంతో నేలలోని పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని శాతం తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడుబారిపోతోంది. అలాగే చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భూసార పరీక్షలు చేసుకుంటే నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుస్తాయని, వాటిని బట్టి అనువైన పంటలు పండిస్తే నాణ్యమైన పంట దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

మట్టి నమూనాలు ఇలా తీయాలి..

- పంటకోత పూర్తయిన తర్వాత వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు తీయాలి. పొలాలకు సాగునీరు పెట్టినపుడు, ఎరువులు వేసిన తర్వాత మట్టి నమూనాలు సేకరించకూడదు.
- పొలాల్లో నీడ పడే ప్రదేశాలు, చేలు గట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనాలు తీయవద్దు.

ముందుగా నేలలోని గడ్డి, చెత్త, కలుపుమొక్కలు తీసేయాలి. 'వి' ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పైపొర నుంచి కింది వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి.

- వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో ఎనిమిది ప్రదేశాలో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో బాగా కలిపి అరకేజీ బరువు వచ్చేలా తీసుకున్న నమూనాను నీడలో ఆరబెట్టాలి.
- మట్టి బాగా ఆరిన తర్వాత పాలిథిన్ కవర్‌లో నింపి రైతుల వివరాలు, సర్వే నంబరు, విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలతో పరీక్ష కేంద్రానికి పంపాలి.
- వ్యవసాయ పంటలు పండించే భూముల్లో ఆరు అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పండ్ల తోటల్లో మూడు అడుగుల లోతులో ప్రతి అడుగుకు ఒక నమూనా, చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతుతో ప్రతి ఆరు అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

ఫలితాల ఆధారంగా పంటలు..

వ్యవసాయ క్షేత్రాల్లో సేకరించిన మట్టిని ప్రయోగశాలకు పంపించి, పరీక్ష ఫలితాల ఆధారంగా నేల స్వభావాన్ని, లక్షణాలు తెలుస్తాయి. నేలలో లభ్యమయ్యే లవణాల సాంద్రత(ఎలక్ట్రికల్ కండక్టవిటీ), ఆమ్ల, క్షార గుణాలు, పోషకాల స్థాయిని విశ్లేషించి వాటి ఆధారంగా వేయాల్సిన పంట, వినియోగించే ఎరువుల మోతాదును సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గి, నాణ్యమైన పంట, అధిక దిగుబడులు సాధించుకోవచ్చు.

భూసార పరీక్ష కీలకం..



వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకం. భూసారం ఆధారంగా పంటలు వేసుకోవడం వల్ల పంటపై ఓ అంచనా వస్తుంది. ఏ సమయంలో ఎంత ఎరువు వేయాలి, ఎంత దిగుబడి వచ్చే అవకాశం ఉందన్న అవగాహన కలుగుతుంది. మండలంలో 1158 భూసార పరీక్షలకు సంబంధించి శాంపిల్స్ తీయాల్సి ఉండగా, ఇంతవరకు 750 శాంపిల్స్ తీశాం. త్వరలోనే ఆ లక్ష్యాలు పూర్తి చేస్తాం.

–ఆర్.విజయభారతి, ఏవో, గరుగుబిల్లి

సుందరయ్యకు నివాళులు

పాలకొండ: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాతల్లో అగ్రగణ్యుడైన కామ్రేడ్ సుందరయ్య పోరాట యోధుడని కొనియాడారు. సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాద రాము, దూసి దుర్గారావు, ఎ. భానుచందర్, సంజీవి, పి. వేణు, న్యాయవాది పద్మలత, తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

పాలకొండ రూరల్: స్థానిక గాంధీ విగ్రహం సమీపంలో సోమవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. వాహనదారుడు ప్రధాన రహదారి నుంచి పక్క రోడ్డులోకి ప్రవేశించే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పకోడి బండిని ఢీ కొట్టింది. దీంతో అక్కడే ఉన్న దుర్గమ్మతో పాటు మరొకరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వారు చిన్ని చిన్న గాయాలతో బయటపడ్డారు. ఇంటి గోడను తాకి వాహనం ఆగిపోయిందని, లేనిపక్షంలో పెను ప్రమాదం జరిగేదని పలువురు తెలిపారు. క్షతగాత్రులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదానికి కారణమైన కారు

విద్యార్థులకు సత్కారం

సీతంపేట: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సామరెల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎం.సంజన, వి. శ్రీలక్ష్మి, కె. కావ్యలను నగదు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంఓ పి.కోటిబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో మరింతగా రాణించి, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆరిక భాస్కరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



విద్యార్థినులను సత్కరిస్తున్న ఏఎంఓ కోటిబాబు

చలివేంద్రం ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డులో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బి.గౌరీశంకరరావు కోరారు. గ్రామస్తులు బోటు లక్ష్మీనారాయణ, కోరాడ మన్మథల ప్రోత్సాహంతో గుమ్మడి శశిదేవి, కొనిన సూర్యప్రకాశరావు, కొమ్మనబిల్లి గౌరీశంకరరావు, యుగంధర్‌ల ఆర్థిక సాయంతో ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, వారికి ధన్యవాదాలన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న గ్రామస్తులు



బురద రోడ్లతో అవస్థలు

భామిని మండలంలో సోమవారం కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్లన్నీ బురదమయంగా తయారయ్యాయి. ప్రస్తుతం రబీ వరి కోతలు, నూర్పులు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఆ వాహనాలు, యంత్రాలన్నీ పొలాల నుంచి నేరుగా రోడ్లపైకి రావడంతో రోడ్లన్నీ బురదతో నిండిపోతున్నాయి. ఈ సమయంలో వర్షం పడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే యంత్రాల వల్ల గురండి – బిల్లుమడ, తదితర రోడ్లు పాడయ్యాయి. – భామిని

పిల్లలకు నీతి కథలు

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పిల్లలకు సోమవారం నీతి కథలను బోధించారు. స్థానిక ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.మల్లేశ్వరరావు నీతి కథలు చెప్పి వాటిలోని నీతిని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బబ్బూరు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్, చిన్నారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీకాశీ విశాలాక్షి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శ్రీసుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ, పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులంతా స్వామి వారిని దర్శించుకుని, విశేష పూజలు చేశారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని గుజ్జువాయి గ్రామం నుంచి డేరింగపాడు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం భూమిపూజ చేశారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కె.కళావతి, ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలకు హాజరుకాకుంటే చర్యలు తప్పవు

జియ్యమ్మవలస రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో కె.ధర్మారావు సోమవారం సమావేశమై పలు సూచనలు చేశారు. అధికారిక సమావేశానికి కొంతమంది హాజరుకావడం లేదని, ఇదే వైఖరి కొనసాగితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకనుంచి హాజరుకావాల్సిన ప్రతి సమావేశానికి హాజరు కావాలన్నారు.

డీఈఓ కార్యాలయం ముట్టడి రేపు



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

దత్తిరాజేరు: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, తదితర డిమాండ్లపై ఈనెల 21న డీఈఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయ సంఘ నాయకులు రామ్‌ప్రసాద్, హరీష్, సత్యనారాయణ, పరుశురాం, గురునాయుడు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలపై చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. యూటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి ఉపాధ్యాయుడూ పాల్గొనాలని కోరారు.

పరామర్శ

పాలకొండ / పాలకొండ రూరల్: ఇటీవల పిడుగు పాటుతో మృతి చెందిన నక్కలపేట కాలనీకి చెందిన జోగ లక్ష్మీదేవి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు సోమవారం పరామర్శించారు. మృతురాలి భర్త ఎర్రన్నాయుడు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎమ్మెల్సీ వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ సూర్యనారాయణబాబు, రైతు సంఘ నాయకులు కరణం అప్పారావు, మజ్జి ప్రసాద్, అప్పలనాయుడు, కిరణ్, చంటి తదితరులున్నారు.



లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, తదితరులు

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

జియ్యమ్మవలస రూరల్: పీఎంఏవై(ప్రధానమంత్రి ఆవాస్ యోజన) పథకం కింద మంజూరైన గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎల్.ఉమామహేశ్వరరావు ఆదేశించారు. మండలంలోని చిలకలవానివలస గ్రామంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన సోమవారం పరిశీలించారు. మొత్తం 217 ఇళ్లు మంజూరు కాగా కొన్ని నిర్మాణ దశలో ఉండగా, 38 నిర్మాణాలు అస్సలు ప్రారంభించలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారుల వద్దకు వెళ్లి, ఇళ్ల నిర్మాణాల పూర్తికి సూచనలు చేశారు.



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ ఉమామహేశ్వరరావు

భూ వివరాలు సరిచేయండి

జియ్యమ్మవలస రూరల్: ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదైన తమ భూ వివరాలు సరిచేయాలని మండలంలోని తురకనాయుడువలస గ్రామ రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో తహసీల్దారు చిన్నారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలోని 50 మంది రైతుల వాస్తవ భూమి.. ఆన్‌లైన్‌లో ఎక్కువ భూమి కలిగి ఉన్నట్లు చూపిస్తోందని, దీంతో తామంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని వాపోయారు.

ద్వారపురెడ్డి మహేష్ అనే రైతుకు వాస్తవంగా ఎకరం పొలం ఉంటే ఆయన పేరిట 250.25 ఎకరాలు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోందని పేర్కొన్నారు. తహసీల్దారును కలిసిన వారిలో ద్వారపురెడ్డి రామినాయుడు, తిరుపతిరావు, రుత్తల దాలినాయుడు తదితరులు ఉన్నారు.

షెడ్యూల్డ్ ఏరియా పోస్టులు మినహాయించాలి..

సీతంపేట: డీఎస్సీలో షెడ్యూల్డ్ ఏరియా ఆదివాసీ పోస్టులు మినహాయించాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు బి. శ్రీనివాసరావు, కార్యదర్శులు బి. ఉమామహేశ్వరరావు, కె.భాస్కరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మంగళవారం నిర్వహించనున్న మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లోని ఖాళీలను గిరిజనులతోనే భర్తీ చేయాలని స్పష్టం చేశారు. పలు డిమాండ్లతో ఈ నెల 27న సీతంపేటలో భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సాగునీటి కాలువలను మెరుగుపరచాలి

పాలకొండ రూరల్: రానున్న ఖరీఫ్‌లో రైతులు సాగునీటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు సాగునీటి కాలువలను మెరుగు పరచాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో కలిసి మాట్లాడుతూ.. మండలంలోని పీఆర్.రాజుపేట పరిధిలో గల పద్మనాభ చెరువు దిగువన పాలకొండ, రాజుపేట రైతులు దాదాపు 200 ఎకరాలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చెరువును అనుసంధానం చేస్తూ పొలాలకు నీరు సరఫరా చేసే కాలువలు పూడికతో నిండిపోవడంతో ఇబ్బందులేర్పడుతున్నాయని, ఈ నేపథ్యంలో కాలువల్లో పూడికలు తొలగించాలని కోరారు. అలాగే గ్రామాల్లో ఫారంపాండ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని కోరారు.



ఎంపీడీఓకు సమస్య వివరిస్తున్న ప్రసాదరావు తదితరులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పాలకొండ రూరల్: వేసవి ముగిసి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. దీంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వెములకొండ కమల్‌నాథ్ అన్నారు. మండంలోని గొట్టమంగళాపురం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. అనంతరం సీజనల్ జ్వరాలు, ఆరోగ్య సమస్యలు, వాటి లక్షణాలపై వివరించారు. ఈ క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కమల్‌నాథ్

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

జియ్యమ్మవలస రూరల్: భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని అర్నాడ పంచాయతీ గిరిజనులు కోరుతున్నారు. ఇదే విషయమై వనిజ, కొత్తగూడ, బిల్లమానుగూడ గ్రామాలకు చెందిన కొండగొర్రె అప్పలస్వామి, కూరంగి రాజు, అడ్డాకుల భూషణ్, సంతోష్, పెంటయ్యలు మండల కేంద్రానికి సోమవారం వెళ్లి, తహసీల్దారు ఎం.చిన్నారావుకు ఫిర్యాదు చేశారు. తాము కొన్నేళ్లుగా సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్న రెండెకరాల జిరాయితీ భూమిని వనిజ గ్రామానికి చెందిన మీనక తవిటయ్య అనే వ్యక్తి ఆక్రమించుకుని, ప్రశ్నిస్తున్న తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని వాపోయారు. మదన్‌మోహన్‌పాత్రో అనే భూస్వామి నిరుపేదలమైన తమకు ఎన్నో ఏళ్ల క్రితం ఆ భూమిని సాగు చేసుకోమని అప్పగించారని, ఆ పక్కనే మరో ఎకరం పొలాన్ని తవిటయ్యకు ఇచ్చారని తెలిపారు. 2022 నుంచి తమ భూమిని ఎలాగైనా లాక్కోవాలని ప్రయత్నిస్తున్నాడని, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇరువర్గాల మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, అప్పటికీ తేలకపోతే కోర్టులో కేసు వేసి పరిష్కరించుకోవాల్సి ఉంటుందన్నారు.



ఫిర్యాదుపత్రం అందజేస్తున్న గిరిజనులు

నేడు రావుపల్లిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి శ్రీసత్యసాయి బాబా మందిరం వద్ద మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆశయ హెల్పింగ్ హ్యాండ్స్ కమిటీ సభ్యులు చుక్క జగమ్, పి.భార్గవ రామ్‌లు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కంటి వైద్య తనిఖీలు చేయడం జరుగుతుందని, అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందివ్వడంతో పాటు అవసరమైతే ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. శిబిరానికి వచ్చే వారంతా ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులతో పాటు బ్యాంకు పాస్‌బుక్, ఫోన్ నంబర్, రెండు జతల దుస్తులను వెంట తీసుకురావాలన్నారు. ఆపరేషన్లకు ఎంపికైన వారిని ఇక్కడి నుంచే శస్త్రచికిత్సకు ఆస్పత్రికి తరలించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 9959230709ను సంప్రదించాలని కోరారు.